ఓటీఎస్‌పై అవగాహన కల్పించాలి : జడ్సీ

కేపీహెచ్‌బీ కాలనీ, మార్చి 23 : జీహెచ్‌ఎంసీ ఆస్తిపన్ను బకాయిలపై 90 శాతం వడ్డీరాయితీ అంశంపై అవగాహన కల్పించాలని జడ్సీ అభిలాష అన్నారు. శనివారం కూకట్‌పల్లి జోన్ కార్యాలయంలో ఆస్తిపన్ను వసూళ్లు, చెరువుల పరిరక్షణ, వర్షనీటి ఇంకుడు గుంతల నిర్మాణంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జీహెచ్‌ఎంసీ కల్పించిన ఓటీఎస్ స్కీమ్‌పై అవగాహన కల్పించాలని.. మొండి బకాయిదారులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలన్నారు. కూకట్‌పల్లి పరిధిలోని చెరువుల పరిరక్షణ కోసం 41 లేక్ ప్రొటెక్షన్ టీమ్‌లను ఏర్పాటు చేయడం జరిగిందని.. ఈ టీమ్‌లు ప్రతిరోజూ చెరువులను పరిశీలించి ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ పరిధిలో అక్రమ నిర్మాణాలను గుర్తించి ఉన్నతాధికారులకు సమాచారమివ్వాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఈ చిన్నారెడ్డి, సీపీ ఉమాదేవి,ఎంటమాలజిస్ట్ సంధ్య, ఏఎంసీ , డీసీలు ఉన్నారు.

సోలో ప్రదర్శన..

కొండాపూర్, మార్చి 23 : మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో చిత్రకారుడు విక్రమ్ రాజ్ సవతి శనివారం మీడియా రంగంలోని ప్రముఖుల చిత్రాలతో ఐకాన్ ఫ్రేమ్ పోర్ట్రెయిట్స్ పేరిట ఏర్పాటు చేసిన సోలో ప్రదర్శనను డాక్టర్ సవార్కర్, డాక్టర్ జయ దరిందే, డాక్టర్ దేవయ్య, డాక్టర్ విరహత్ అలీ, రాయ దాస్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రదర్శన లోని చిత్రాలను తిలకించారు.

ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లలో అనుమతులేలా ఇస్తారు..?

- గంగారం చెరువులో 65 అక్రమ నిర్మాణాలు పూర్తవ్వగా, మరో 10 నిర్మాణాలకు అనుమతులు..
- అధికారులతీరుపై ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ ఆగ్రహం

గంగారం చెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ మంజులరెడ్డి

కొండాపూర్, మార్చి 23 : చెరువుల ఆక్రమణదారులకు జీహెచ్‌ఎంసీ టౌన్‌ప్లానింగ్, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు వత్తాసు పలుకుతుండటంపై శేరిలింగంపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. చందానగర్ సర్కిల్ -21 పరిధిలోని గంగారం చెరువును శనివారం ఆయన స్థానిక కార్పొరేటర్ మంజుల రఘునాథరెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అక్రమార్కులు చెరువులోని 3 ఎకరాల్లో ఇప్పటికే మట్టితో నింపి ఆక్రమణకు పాల్పడ్డారని తెలిపారు. చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో 65 అక్రమ నిర్మాణాలు పూర్తవ్వగా, మరో 10 నిర్మాణాలకు దొడ్డి దారిన జీహెచ్‌ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు అనుమతులివ్వడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక భవనం నిర్మాణ దశలో ఉన్నా, ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం ఏంటని ప్రశ్నించారు. గంగారం పెద్ద చెరువును త్వరలోనే పూర్తి స్థాయిలో సుందరీకరించి, ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. సుందరీకరణ పనుల్లో అసంపూర్తిగా మిగిలిపోయిన వాటిని వెంటనే పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. చెరువు మధ్యలో ఐలాండ్ నిర్మాణం ద్వారా ప్రత్యేక శోభ సంతరించుకోనున్నట్లు తెలిపారు. దీంతో పాటుగా వాకింగ్ ట్రాక్, బోటింగ్‌లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. చెరువు చుట్టూ హద్దులను నిర్ణయించి, ఫెన్సింగ్ ఏర్పాటు చేయాల్సిందిగా సదరు శాఖల అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ కార్యక్రమంలో చందానగర్ డివిజన్ అధ్యక్షుడు రఘునాథరెడ్డి, నాయకులు నరేందర్, వరలక్ష్మి, అవినాష్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం


సంక్షేమ సంఘాల నేతల నుంచి సమస్యలు తెలుసుకుంటున్న కౌన్సిలర్ శంభీపూర్‌కృష్ణ

దుండిగల్, మార్చి 23 : నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బీఆర్ఎస్ నేత, దుండిగల్ మున్సిపాలిటీ కౌన్సిలర్ శంభీపూర్‌కృష్ణ అన్నారు. శంభీపూర్‌లోని ఆయన కార్యాలయం వద్ద నియోజకవర్గం పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు, సంక్షేమ సంఘాల నేతలు, బీఆర్ఎస్ కార్యకర్తలు శనివారం ఆయనను కలిసి.. తమ,తమ కాలనీలు,బస్తీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. స్పందించిన ఆయన సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తున్నామన్నారు. ప్రాధాన్యత క్రమంలో సమస్యలు పరిష్కరిస్తూ ముందుకు వెళ్తున్నామన్నారు.

రాగిడి లక్ష్మారెడ్డి గెలుపే లక్ష్యంగా పని చేస్తాం

దుండిగల్,మార్చి23 : మల్కాజిగిరి పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి గెలుపే లక్ష్యంగా పని చేస్తామని నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్, 7వ డివిజన్ కార్పొరేటర్ ప్రణయయాదవ్ అన్నారు. లక్ష్మారెడ్డి సతీమణి రాగిడి రజనీ, వారి కూతురు,సోదరి, తదితరులు కార్పొరేటర్ ప్రణయయాదవ్‌ను ఆమె నివాసంలో శనివారం కలిశారు. ఈ సందర్భంగా రాగిడి రజనీ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ శ్రేణులంతా తమకు మద్దతు తెలపాలని కోరారు. రానున్న ఎన్నికల్లో లక్ష్మారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలుపించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులతో తామంతా సమన్వయంతో శక్తివంచన లేకుండా కృషి చేస్తామని అన్నారు.

కార్పొరేటర్ ప్రణయయాదవ్‌ను కలిసిన బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి కుటుంబసభ్యులు

నీటి వనరులను కాపాడుకోవాలి

కేపీహెచ్‌బీ కాలనీ, మార్చి 23 : భవిష్యత్ తరాలు భూమిపై మనుగడ సాధించాలంటే నీటి వనరులను కాపాడుకోవాలని సోషల్ సైన్స్ సిటీ అధ్యాపకులు డబ్ల్యూజీ ప్రసన్నకుమార్ అన్నారు. శనివారం జేఎన్‌టీయూహెచ్ ఎన్విరాన్‌మెంట్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో వరల్డ్ వాటర్ డే సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు హాజరైన సోషల్ సైన్స్ సిటీ అధ్యాపకులు డబ్ల్యూజీ ప్రసన్నకుమార్ అండ్ సుధీర్‌కుమార్, డిపార్ట్‌మెంట్ హెచ్‌వోడీ హిమబిందువులు మాట్లాడుతూ.. పర్యావరణ సమతుల్యత లోపించినప్పుడు నీటి కష్టాలు వస్తాయని.. ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దేశంలో దూసుకుపోతున్న లీగల్ ఎడ్యుకేషన్

కేపీహెచ్‌బీ కాలనీ, మార్చి 23 : లీగల్ ఎడ్యుకేషన్ దేశంలో దూసుకుపోతుందని.. నేటి సమాజానికి ఎక్కుమంది లా గ్రాడ్యుయేట్లు అవసరమని ఉస్మానియా విశ్వవిద్యాలయం డైరెక్టర్ జి.బి.రెడ్డి అన్నారు. కూకట్‌పల్లిలోని అనంత న్యాక కళాశాలలో జరిగిన అనంతోత్సవం వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన జి.బి.రెడ్డి మాట్లాడుతూ.. న్యాయవాదులకు కావాల్సింది క్యారెక్టర్, మంచి అటిట్యూట్, సరైన వైఖరి అన్నారు. అనంతరం విద్యార్థులకు అనంతరాజమ్మ మెమోరియల్ గోల్డ్ మెడల్స్‌ను అందించారు. విద్యార్థులు ఆటపాటలతో సందడి చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎం.వి.చంద్రమతి, కరస్పాండెంట్ రవి, అధ్యాపకులున్నారు.

గర్భిణులకు సామూహిక శ్రీమంతాలు

బాలానగర్ , మార్చి 23 : గర్భిణులకు, బాలింతలకు, చిన్నపిల్లలకు చిరుధాన్యపై అవగాహన ఎంతో అవసరం అని అంగన్‌వాడీ సూపర్ వైజర్ సత్తెమ్మ అన్నారు. శనివారం ఓల్డ్‌బోయిన్‌పల్లి వార్డు కార్యాలయంలో ఏర్పాటు చేసిన తల్లిపాల ప్రధాన్యత, పోషణ సంరక్షణ అనే కార్యక్రమంతో పాటు గర్భిణులకు సామూహిక శ్రీమంతం జరిపించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రక్తహీనత, చిరుధాన్యాల వినియోగం, తల్లిపాల ప్రధాన్యత అంశాలపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ దీప్తి, ఏఎన్‌ఎం స్వరూప, అంగన్‌వాడీ టీచర్ పద్మ, ధనలక్ష్మి, ఆయా స్వప్న, గర్భిణులు హేమలత, బసవమ్మ, ప్రవంతి, రుక్సానా, తదితరులు పాల్గొన్నారు.

మహిళల అభ్యున్నతికి తోడ్పాటు ..

బాలానగర్ , మార్చి 23 : మహిళల అభ్యున్నతికి తోడ్పాటు అందించనున్నట్లు బాలానగర్ కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి అన్నారు. శనివారం బాలానగర్ డివిజన్ పరిధిలోని సాయినగర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మహిళలతో కలిసి కేక్ కట్ చేసి మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మహిళలు మనోధైర్యంతో ముందుకు సాగినప్పుడే మనుగడ సాధ్యపడుతుందన్నారు. మహిళలు పురుషులతో సమానంగా స్వయం ఉపాధి రంగాల్లో రాణిస్తున్నారని సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జయసుధ, లక్ష్మి, శ్రీదేవి, మధులత, తదితరులు పాల్గొన్నారు.

నీటిని పొదుపుగా వాడుకోవాలి ..

జీడిమెట్ల, మార్చి 23 : నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని జలమండలి కుత్బుల్లాపూర్ జీఎం శ్రీధర్ రెడ్డి అన్నారు. ప్రపంచ నీటి దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం సుభాష్‌నగర్ డివిజన్, ఎస్ఆర్ నాయక్ నగర్‌లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ.. నిత్యావసరాల్లో నీరు ముఖ్యమైందని , నీటిని పొదుపుగా వాడుకొని భావితరాలకు మంచి సందేశాన్ని అందించాలన్నారు. ఈ నెల 28వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి డీజీఎం రాజేశ్, మేనేజర్ రాజు, కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ రావు, నాయకులు పూర్ణచందర్ గుప్తా, మధుసూదన్ రావు, మల్లికార్జున్ రావు, హరిబాబు, శాస్త్రీ, ఎంఎస్ వాసు పాల్గొన్నారు.

ఇంటి నుంచి ఓటేసే అవకాశం

కుత్బుల్లాపూర్,మార్చి23: ఎన్నికల కమిషన్ ఇచ్చిన ఆదేశాల మేరకు 85 ఏండ్లు దాటి న వృద్ధులకు, అర్హులైన దివ్యాంగులకు ఫాం 12డీ ద్వారా ఇంటి నుండే ఓటు వేసేందుకు ఆస్కారం కల్పిస్తున్నామని కుత్బుల్లాపూర్ అసిస్టెంట్ ఎన్నికల అధికారి పులి సైదులు తెలిపారు. శనివారం నియోజకవర్గంలో గుర్తించిన వారి ఇండ్లకు వెళ్లి పరిశీలించారు. అనంతరం వారికి 12డీ ఫాంను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేవారు స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సమాచారం అందించాలని కోరారు.

ఆక్రమణల తొలగింపు

కేపీహెచ్‌బీ కాలనీ, మార్చి 23 : కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అభిలాష ఆదేశాల మేరకు మూసాపేట సర్కిల్ అధికారులు జేఎన్‌టీయూహెచ్ బస్టాప్‌లో ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించారు. రోడ్డుపై వేసిన పార్సిల్ సర్వీసెస్ ప్యాకేజీలను స్వాధీనం చేసుకున్నారు.

సందడిగా హోలీ వేడుకలు

మియాపూర్ , మార్చి 23 : హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని రిషి మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో హోలీ వేడుకలు శనివారం సందడిగా జరిగాయి. డిగ్రీ, ఇంజినీరింగ్, ఎంబీఏ విభాగాలకు చెందిన వందలాది మంది విద్యార్థినులు పరస్పరం రంగులు చల్లుకుంటూ ఆటపాటలతో సందడి చేశారు. విద్యార్థినులతో పాటు అధ్యాపకులు, సహ ఆచార్యులు సైతం రంగులు చల్లుకుని సరదాగా గడిపారు. కళాశాల కరస్పాండెంట్ రాజశ్రీ తో పాటు అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

భగత్ సింగ్, రాజగురు, సుఖ్‌దేవ్‌లకు నివాళి


మియాపూర్ డివిజన్, ఎంఏనగర్ పార్టీ కార్యాలయంలో భగత్ సింగ్, రాజగురు, సుఖ్‌దేవ్ ల చిత్రపటాలకు పూలమాలలువేసి నివాళులర్పిస్తున్న నాయకులు

దుండిగల్,మార్చి23 : గాజులరామారం సర్కిల్,సూరారం డివిజన్ పరిధి, షాపూర్‌నగర్‌లోని సీఐటీయూ కార్యాలయంలో భగత్ సింగ్ 93వ వర్ధంతిని శనివారం నిర్వహించారు . డీవైఎఫ్ఐ,సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి డీవైఎఫ్ఐ మాజీ జిల్లా అధ్యక్షులు కీలుకాని లక్ష్మణ్ ముఖ్య అతిథిగా పాల్గొని భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా నాయకులు శ్రీనివాస్, ఖలీల్, అంజయ్య, సీఐటీయూ నాయకులు దేవదానం,జహీర్ తదితరులు పాల్గొన్నారు.

- నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్,ప్రగతి నగర్‌లోని నెమలిబొమ్మల చౌరస్తాలో కేవీపీఎస్,సీఐటీయూ,ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జరిగిన భగత్‌సింగ్,సుఖ్‌దేవ్,రాజ్‌గురు వర్ధంతి కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా కేవీపీఎస్ కార్యదర్శి బాలపీరు,ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్‌సభ్యులు శ్రీనివాస్,సీఐటీయూ నాయకులు ఏం.చంద్రశేఖర్ పాల్గొన్నారు.
- కేపీహెచ్‌బీ కాలనీ, మార్చి 23 : భారత దేశ స్వాతంత్ర పోరాట ఉద్యమంలో అసువులుబాసిన భగత్‌సింగ్ పోరాటం స్ఫూర్తిదాయకమని కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేశ్ అన్నాడు. శనివారం భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా కూకట్‌పల్లి బస్టాప్‌లో భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఏ-బ్లాక్ అధ్యక్షుడు పి.నాగిరెడ్డి, సీనియర్ నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వర్ రావు, సునీల్ యాదవ్, గూడెపు నాగరాజు, వెంకట్‌రెడ్డి తదితరులున్నారు.
- జగద్గిరిగుట్ట, మార్చి 23 : మతోన్మాద శక్తుల ఓటమే ధ్యేయంగా పోరాడాలని అని సీపీఐ నేతలు అన్నారు. భగత్‌సింగ్ వర్ధంతిని జగద్గిరిగుట్ట మఖ్ఖాంనగర్, లెనిన్‌నగర్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భగత్‌సింగ్,రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల చిత్రపటాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు. ఏసురత్నం, ఉమామహేశ్, వెంకటేశ్, రాములు,సదానంద పాల్గొన్నారు.
- మియాపూర్ , మార్చి 23 : ఏఐఎఫ్‌డీవై ఆధ్వర్యంలో శనివారం మియాపూర్ డివిజన్ పరిధిలోని ఎంఏనగర్ పార్టీ కార్యాలయంలో భగత్ సింగ్, రాజగురు, సుఖ్‌దేవ్ ల 93 వ వర్ధంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంసీపీఐ(యూ) చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి వనం సుధాకర్, తదితరులు హాజరై వారి చిత్రపటాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో శ్రీనివాసులు, రమేశ్, సుల్తానా, కళావతి, సుకన్య, భాగ్యమ్మ, దానయ్య, లావణ్య, కీర్తి, శివానీ, రాజు, చందర్, కుమార్, శిరీష పాల్గొన్నారు.

మహిళా సంక్షేమమే ప్రభుత్వం లక్ష్యం

మియాపూర్ , మార్చి 23 : మహిళా సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తున్నదని శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి జగదీశ్వర్ గౌడ్ అన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను సద్వినియోగం చేసుకుని మహిళలు మరింతగా రాణించాలన్నారు. వివేకానందనగర్ డివిజన్ పరిధిలో కాంగ్రెస్ నాయకురాలు విద్యాకల్పన ఏకాంత్ గౌడ్ ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్‌రావు, సత్యం, నాగమణి యాదగిరి, ఉప్పల విద్య, యాకయ్య, వెంకటస్వామి భాస్కర్, లక్ష్మి, మల్లేశ్, మంజు, దుర్గారావు, పాల్గొన్నారు.

- చేవెళ్ల పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డిని హైదర్‌నగర్ డివిజన్‌కు చెందిన కాంగ్రెస్ నాయకుడు సిందం శ్రీకాంత్ ఆధ్వర్యంలో పార్టీ నేతలు శనివారం కలిశారు. కార్యక్రమంలో నర్సింగరావు, షకిల్, రాము, విష్ణు, హుస్సేన్ పాల్గొన్నారు.
- తెలంగాణ రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నరగారి ప్రీతంను కాంగ్రెస్ నాయకుడు చిరుమర్తి రాజు శనివారం ఆయన నివాసంలో కలిశారు.

కిందకుంట పార్కును మరింతగా సుందరీకరిస్తాం..

మియాపూర్ , మార్చి 23 : హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని కిందికుంట పార్కులో వాకర్స్ ట్రాక్‌ను కార్పొరేటర్ నార్నె శ్రీనివాస్‌రావు శనివారం పరిశీలించారు. ఆయన మాట్లాడు తూ.. వాకర్స్‌కు సౌకర్యవంతంగా ఉండేలా వాకింగ్ ట్రాక్ నిర్మాణాన్ని మరింత అభివృద్ధి పరుస్తామన్నారు. కిందకుంట పార్కును మరింతగా సుందరీకరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

గంజాయి విక్రేతల అరెస్ట్

మాదాపూర్, మార్చ్ 23: గంజాయి విక్రయాలకు పాల్పడుతున్న ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ సంఘటన శనివారం మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ మల్లేశ్ తెలిపిన కథనం ప్రకారం ... తూర్పు గోదావరి జిల్లా రావులపాలెంకు చెందిన ఫణికిరణ్ యాపుగంటి హైదరాబాద్‌కు వలసవచ్చి ఓ కంపెనీలో ఐటీ ఉద్యోగిగా చేస్తూ గంజాయి సేవించేవాడు. పరిస్థితులు బాగులేక స్నేహితుని ద్వారా పరిచయమైన నాగవర్మతో కలిసి గంజాయి వ్యాపారం మొదలు పెట్టాడు. ఈ క్రమంలో గంజాయి విక్రయిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. స్నేహితుడు నాగువర్మతో పాటు ఫణికిరణ్‌ను అరెస్టు చేసి.. 1643 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

హుక్కా సెంటర్‌పైదాడి.. ముగ్గురు అరెస్టు

మాదాపూర్, మార్చ్ 23: నిబంధనలకు విరుద్ధంగా హుక్కా సెంటర్ నడుపుతున్న ముగ్గురిని మాదాపూర్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం ... హఫీజ్‌పేట్‌లోని మార్తాండనగర్‌కు చెందిన దేవులపల్లి చంద్రశేఖర్‌రెడ్డి ఐటీ ఉద్యోగం చేస్తూ హుక్కా సెంటర్ నడుపుతున్నాడు. భీరంగూడకు చెందిన అల్లు సందీప్‌రెడ్డి క్యాషియర్, ఓల్డ్ సిటీకి చెందిన సయ్యద్ అబ్దుల్ గఫూర్ బౌన్సర్‌గా, మాదాపూర్‌కు చెందిన ఆజాం, ఉప్పల్‌కు చెందిన హుక్కా సెంటర్ యాజమాని అభినవ్‌రెడ్డిలు మాదాపూర్‌లోని దుర్గం చెరువు వద్ద ఫర్‌గెట్ మీ నాట్ కేఫ్ అనే పేరు మీద హుక్కా సెంటర్‌ను నడిపిస్తున్నారు. దీనిని నిబంధనలకు విరుద్ధంగా నడుపుతుండటంతో సమాచారం అందుకున్న సైబరాబాద్ ఎస్ఓటీ పోలీసులు శనివారం ఆ హుక్కా సెంటర్‌పై దాడి చేసి చంద్రశేఖర్‌రెడ్డి, అల్లు సందీప్‌రెడ్డి, బౌన్సర్ అయ్యద్ అబ్దుల్ గఫూర్‌లను అదుపులోకి తీసుకోగా..అభినవ్‌రెడ్డి, ఆజాంలు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

25న హోలీ సంబురాలు

శేరిలింగంపల్లి, మార్చి 23: గచ్చిబౌలిలోని సంధ్య కన్వెన్షన్ సెంటర్‌లో ఈ నెల 25న రెయిన్‌బో ఈవెంట్స్ అండ్ డ్రింక్ డిజైనర్స్ ఆధ్వర్యంలో హోలా మోహల్లా పేరిట హోలీ సంబురాలను నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు.

నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ఉద్యమిద్దాం..

- ప్రతిపక్ష పార్టీల నాయకుల అరెస్టులను ఆపాలి
- సీపీఐ, సీపీఎం నేతలు

ప్రతిపక్ష పార్టీల నాయకుల అరెస్ట్‌ను నిరసిస్తూ నిరసన తెలుపుతున్న సీపీఐ, సీపీఎం నేతలు

కేపీహెచ్‌బీ కాలనీ, మార్చి 23 : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రతిపక్ష పార్టీల నాయకుల అరెస్టులను ఆపాలని సీపీఎం, సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం కూకట్‌పల్లిలో సీపీఎం, సీపీఐ పార్టీల ఆధ్వర్యంలో ప్రధాని మోదీ నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి శంకర్, నాయకులు కె.కృష్ణ నాయక్, చెన్నకేశవులు, సీపీఎం మండల కార్యదర్శి కె.కృష్ణలు మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల ముందు ప్రతిపక్ష పార్టీల నేతలపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగిస్తూ హక్కులను కాలరాస్తుందని అన్నారు. ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, తెలంగాణ మాజీ సీఎం కూతురు కవితను ఇదే తరహాలో అరెస్ట్ చేసిందని ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ బ్యాంక్ అకౌంట్‌ను సీజ్‌చేసి ఎన్నికల్లో దెబ్బ తీయాలని చూస్తుందన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో జరుగుతున్న అవినీతిని పట్టించుకోకుండా ప్రతిపక్ష పార్టీలు పాలిస్తున్న రాష్ట్రాల్లోనే కక్షపూరితంగా వ్యవహరిస్తుందన్నారు. ఎన్నికల ఎలక్ట్రోబాండ్లను ఉపయోగించుకుని రూ.6500 కోట్ల విరాళాలను బీజేపీ పొందిందని, సుప్రీం కోర్టులో పిటిషన్ వేయడం వల్లే ఈ అవినీతి బయటపడిందన్నారు. ఇండియా కూటమిని బలహీనపర్చి ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు ప్రతిపక్ష పార్టీల నాయకులను అరెస్ట్ చేస్తుందని.. దీనిని ప్రజాస్వామ్య వాదులంతా వ్యతిరేకించాలని కోరారు. మోదీ నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా కలిసికట్టుగా ఉద్యమించాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు శ్రీను, తాజ్‌ఉద్దీన్, సీపీఐ నాయకులు అంజి, రమేశ్, ఉపేంద్ర, వసంత, అనిత, ప్రసాద్, మహేశ్ తదితరులున్నారు.

చోరీ కేసులో నిందితుల అరెస్ట్

జగద్గిరిగుట్ట, మార్చి 23 : చోరీ కేసులో ఇద్దరు నిందితులను జగద్గిరిగుట్ట పోలీసులు అరెస్ట్ చేసి.. నగదు, బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు.. సీఐ క్రాంతికుమార్ వివరాలమేరకు.. ఎల్లమ్మ బండ జన్మభూమి కాలనీలో మఖ్సూద్ ఇంట్లో ఈ నెల 20న చోరీకి పాల్పడి రూ. 4లక్షల నగదు, 18తులాల బంగారం ఎత్తుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టి.. సూరారం కాలనీకి చెందిన కూరగాయల వ్యాపారి దేరంగుల రవి, దేరంగుల నరసింహలను అరెస్టు చేశారు. వారినుంచి10తులాల బంగారం, 8తులాల వెండి, రూ. 89వేలు నగదుతోపాటు రూ.3.5లక్షల విలువైన సొదీ కరెన్సీని స్వాధీనం చేసుకున్నారు. మేర కు నిందితులను శనివారం రిమాండ్‌కు పంపారు. కాగా.. రవిను హైదరాబాద్, రాచకొండ కమిషనరేట్ల పరిధిలో 26 చోరీ కేసుల్లో... నరసింహ దుండిగల్ పీఎస్ పరిధిలో జరిగిన హత్యకేసులో నిందితుడు..

దేశాభివృద్ధి కోసం బీజేపీని గెలిపించాలి

కేపీహెచ్‌బీ కాలనీ, మార్చి 23 : దేశ సమాగ్రాభివృద్ధి కోసం బీజేపీని గెలిపించాలని మల్కాజిగిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. శనివారం కేపీహెచ్‌బీ కాలనీ 5వ ఫేజ్‌లో మీట్ అండ్ గ్రీట్ అనే కార్యక్రమానికి ఈటల హాజరు కాగా.. కూకట్‌పల్లి జనసేన పార్టీ నేతలు సంపూర్ణ మద్దతు తెలిపారు. అనంతరం భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జి ప్రేమ్‌కుమార్, బీజేపీ నేతలు వడ్డేపల్లి రాజేశ్వర్‌రావు, ప్రీతంరెడ్డి తదితరులున్నారు.

- అల్లాపూర్,మార్చి 23: రానున్న ఎన్నికలు దేశం కోసం, ధర్మం కోసం జరుగుతున్నాయని.. మరోసారి మోదీసర్కార్‌ను ఆశీర్వదించాలని మల్కాజిగిరి బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ ఓటర్లను అభ్యర్థించారు. శనివారం అల్లాపూర్ డివిజన్ పరిధి వివేకానందనగర్‌లో స్థానికులతో కలిసి ఆయన బ్రేక్ ఫాస్ట్ మీటింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ